క్లుప్తంగా

మహిళా రక్షణలో పోలీస్

డీఎస్పీ రఘువీర్ విష్ణు



మహిళా చట్టాలను వివరిస్తున్న డాక్టర్ చిరంజీవినీ కుమారి

బాలాజీచెరువు: మహిళల సంరక్షణకు పోలీస్ సిబ్బంది ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటారని డీఎస్పీ రఘువీర్ విష్ణు పేర్కొన్నారు. ఐడియల్ ఇంజినీరింగ్ కళాశాలలో ఏఐడబ్ల్యూసీ ఆధ్వర్యంలో మంగళవారం మహిళలపై హింస నిర్మూలన, రక్షణ అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ విష్ణు మాట్లాడుతూ మహిళలపై హింస నివారించడానికి ప్రభుత్వపరంగా తీసుకోవలసిన చర్యలు అన్నీ తీసుకుంటున్నామని, మహిళలు ధైర్యంగా సమస్య ఎదుర్కొనవలసిన అవసరం ఉందన్నారు. ప్రముఖ న్యాయవాది పద్మావతి మాట్లాడుతూ బాధిత మహిళలు నిర్భయంగా తమ సమస్యలు పోలీస్ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ చిరంజీవినీ కుమారి మాట్లాడుతూ మహిళా చట్టాలు కఠినంగా అమలు చేసినప్పుడే చట్టాలపై భయం ఉంటుందన్నారు. మహిళలు ధైర్య సాహసాలు ప్రదర్శించి సమస్యల నుంచి బయట పడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐడబ్ల్యూసీ కాకినాడ కార్యదర్శి భానుమతి, కళాశాల ప్రిన్సిపాల్ టి.శ్రీకాంత్, డైరెక్టర్ కృష్ణంరాజు, జీవీకే వర్మ, డాక్టర్ భరతలక్ష్మి పాల్గొన్నారు.

మహిళలపై హింసను నిరోధించాలి



మహిళా హింసకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న ర్యాలీ

కరప: సమాజంలో మహిళలపై హింస, వేధింపులను నిరోధించడం అందరి బాధ్యత అని భీమాబాయి మహిళా మండలి ప్రాజెక్టు డైరెక్టర్ వాసంశెట్టి నందివర్ధన అన్నారు. లింగాధారిత హింసకు వ్యతిరేక ప్రచార కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలి ఆధ్వర్యంలో కరపలో ర్యాలీ నిర్వహించారు. ఈనెల 25 నుంచి డిసెంబరు పదో తేదీ వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

బొర్రాకు జేవీవీ మద్దతు

కాకినాడ సిటీ: ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థి బొర్రా గోపీమూర్తికి జనవిజ్ఞాన వేదిక మద్దతు ప్రకటించింది. మంగళవారం యూటీఎఫ్ హోంలో మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం చేతుల మీదుగా కరపత్రం ఆవిష్కరించారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక నాయకులు కేఎంఎంఆర్ ప్రసాద్, బీవీవీ సత్యనారాయణ, యుఎస్ఎన్ రెడ్డి, రామలక్ష్మి, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వేంకటపతిగా సీతారామస్వామి



బోట్‌క్లబ్: రజత చిన్న దశావతార అలంకార ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక మెయిన్‌రోడ్డులోని సీతారామస్వామి వేంకటేశ్వరుని అలంకరణలో దర్శనమిచ్చారు. స్వామి వారికి ఉదయం అర్చకులు పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

10 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల నమోదు

కాకినాడ రూరల్: మద్యం తాగి వాహనాలు నడుతున్న వారిపై ఇంద్రపాలెం పోలీసులు కేసులు నమోదు చేశారు. ఎస్సై వీరబాబు తెలిపిన వివరాల మేరకు 10 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసి మంగళవారం కాకినాడలో మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా ఆరుగురికి జైలు శిక్ష, మరో నలుగురికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

వాకలపూడి ఏడీబీ రోడ్డులో ఓఎన్‌జీసీ వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యు.కొత్తపల్లి మండలం శొంఠివారి పాకలు గ్రామానికి చెందిన వెంగలి గోవిందు గాయపడ్డాడు. మోటారు సైకిల్‌పై ఇంటికి వెళ్తుండగా లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయం కావడంతో స్థానికులు కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్టు పోలీసులు తెలిపారు.

ప్లేట్లు, గ్లాసుల పంపిణీ

బోట్‌క్లబ్: ప్రతి మనిషి సేవాగుణం అలవరచుకోవాలని లయన్స్‌క్లబ్ మాజీ గవర్నర్ మాదిరెడ్డి బాబూజీరావు అన్నారు. భారత రాజ్యాంగ వజ్రోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక విముక్తి కాలనీ వాసులకు స్టీల్ ప్లేట్లు, గ్లాసులు అందించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. సఖి లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు కొడాలి ఉమ, క్లబ్ జోన్ చైర్మన్ ఓం నమశ్శివాయ, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

సెస్సు.. ఇదో న్యూసెన్సు!

- చెల్లింపులలో అధికారుల నిర్లక్ష్యం
- అభివృద్ధికి నోచుకోని గ్రంథాలయాలు
- కార్పొరేషన్ బకాయిలు రూ.9 కోట్ల పైమాటే



జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యాలయం

బాలాజీచెరువు: సెస్సు సక్రమంగా వసూలు కాకపోవడంతో గ్రంథాలయాల అభివృద్ధి కుంటుపడుతోంది. స్థానిక సంస్థలు వసూలు చేస్తున్న సెస్సు సంస్థకు అందితే అభివృద్ధి పనులు, వసతులు, సౌకర్యాలు కల్పించేందుకు వీలవుతుంది. గ్రంథాలయాలకు వచ్చే వారంతా నిరుద్యోగులు, పోటీ పరీక్షల సామగ్రి, విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉంచాల్సి ఉంటుంది. అయితే సెస్సు నిధులు అందనందున అధికారులు దీనిపై స్పష్టమైన చర్యలు చేపట్టలేకపోతున్నారు. ఫలితంగా గ్రంథాలయాలు గత ప్రాభవాన్ని కోల్పోతున్నాయి. జిల్లాలో ఉన్న గ్రామ పంచాయతీలు, మున్సిపల్, కార్పొరేషన్లు గ్రంథాలయ సెస్సు సంస్థకు జమ చేయకపోవడంతో బకాయిలు రూ.లక్షల్లో పేరుకుపోతున్నాయి. అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకుంటున్నా ఉపయోగం కనిపించడం లేదు. నగరంలో గ్రంథాలయాలు గ్రేడ్-1 రెండు, గ్రేడ్ -2 గాంధీనగర్, శ్రీనగర్, గ్రేడ్ -3 జగన్నాథపురం, గ్రేడ్-4 రామకృష్ణారావుపేటలో ఉండగా పుస్తక నిక్షిప్త గ్రంథాలయాలు (బీడీసీలు) ఐదు వరకూ ఉన్నాయి. బీడీసీ నిర్వహణకు ఒక్కొక్కదానికి ప్రతి నెలా రూ.1500 సంస్థ చెల్లించేవారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో 4 వేల రూపాయలు పెంచి బీడీసీలకు మరింత చేయూతనిచ్చారు. మున్సిపల్, గ్రామ పంచాయతీ స్థాయిలో నూటికి ఎనిమిది రూపాయలు సెస్సు రూపంలో వసూలు చేస్తారు. పన్నులు వసూలు చేసేటప్పుడు గ్రంథాలయ సెస్సు వసూలు చేసి వాటిని తిరిగి జిల్లా గ్రంథాలయ సంస్థకు చెల్లించాలి. అయితే సెస్సు వసూలు ప్రతి ఏడాది ప్రజల నుంచి స్థానిక సంస్థలు వసూలు చేసుకుంటున్న వాటిని అదే తరహాలో ఏటా గ్రంథాలయసంస్థకు చెల్లించాల్సి ఉన్నా తిరిగి చెల్లించలేదు. పంచాయతీల నుంచి దాదాపు 16 కోట్ల బకాయిలు ఉండగా కాకినాడ కార్పొరేషన్ నుంచి రూ.9,66,35,752 రావాల్సి ఉంది.

సెస్సు చెల్లిస్తేనే సౌకర్యాలు



గ్రంథాలయాలకు చెల్లించాల్సిన సెస్సుపై ఆయా స్థానిక సంస్థలకు నోటీసులు ఇస్తున్నాం. దీనిపై ఏ విధమైన సమాధానం రావడం లేదు. ప్రజల నుంచి వసూలు చేసే పన్నుల్లో ఏటా గ్రంథాలయ వాటా సక్రమంగా తమకు చెల్లిస్తే రూ.కోట్ల స్థాయిలో బకాయిలు ఉండవు. గ్రంథాయాల్లో మెరుగైన సదుపాయాలు, సౌకర్యాల కల్పనకు నిధులు అవసరం ఉంది.

– వీఎల్ఎన్ఎస్‌వీ ప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి

ఆధ్యాత్మిక దృక్పథంతో సామాజిక చైతన్యం

బోట్‌క్లబ్: ఆధ్యాత్మిక దృక్పథం ఉంటే సమాజాన్ని చైతన్యం చేసే ధర్మ ప్రబోధం ఏర్పడుతుందని కాకినాడ స్వయంభూ భోగి గణపతి పీఠం వ్యవస్థాపకుడు దూసర్లపూడి రమణరాజు అన్నారు. హరహర మహాదేవ ఫౌండేషన్ చైర్మన్ కాజా సత్య వీర ప్రసాదరావును మంగళవారం నగర గణేశ ఉత్సవ సమితి సభ్యులు సత్కరించారు. ఫౌండేషన్ స్థాపించిన శివాలయాల్లో ప్రతి కార్తికమాసంలో 10 వేల దీప జ్యోతులతో శివ భక్తులు ద్వారా మహాదేవుని ఆరాధించే మహోన్నత కార్యక్రమం చేపడుతున్నారన్నారు. సమితి జిల్లా అధ్యక్షుడు మాలకొండయ్య మాట్లాడుతూ సనాతన ధర్మంలో సమాజ శ్రేయస్సు ఉందన్నారు.

ధోబీఘాట్‌లు నిర్మించాలి

కాకినాడ సిటీ: జిల్లా రజక వృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలని, ధోబీఘాట్‌లు నిర్మించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కోనేటి రాజు డిమాండ్ చేశారు. మంగళవారం కాకినాడ సుందరయ్యభవన్‌లో రాష్ట్ర రజకవృత్తిదారుల సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. 50 ఏళ్ల నిండిన రజక వృత్తిదారులకు పెన్షన్ సదుపాయం కల్పించాలన్నారు.

కనీస వేతనం, గిట్టుబాటు ధరలకు చట్టం చేయాలి



కార్మికులు, రైతులకు అభివాదం చేస్తున్న కేంద్ర కార్మిక సంఘాల నాయకులు

కాకినాడ సిటీ: పంటల పెట్టుబడిపై అదనంగా 50 శాతం చెల్లించి, రైతులకు గిట్టుబాటు కల్పించేలా చట్టం చేయాలని, ఏ రంగంలో పని చేసే కార్మికులకైనా కనీస వేతనాన్ని రూ.26 వేలుగా నిర్ణయించి అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కేంద్ర కార్మిక, రైతు సంఘాలు కలెక్టరేట్ వద్ద మంగళవారం ధర్నా నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు జి.బేబీరాణి, తోకల ప్రసాద్, జె.వెంకటేశ్వర్లు, తిరుమలశెట్టి నాగేశ్వరరావు, అప్పారెడ్డి, తాళ్లూరి రాజు, రాజబాబు, మోర్త రాజశేఖర్, టేకుమూడి ఈశ్వరరావు, పప్పు ఆదినారాయణ, ఏసు తదితరులు ప్రసంగించారు. 60 ఏళ్లు పని చేసి రిటైరైన వారికి రూ.10 వేల కనీస పెన్షన్ చెల్లించాలన్నారు. ఆటో, హమాలీ, ట్రాన్స్‌పోర్టు, భవన నిర్మాణ రంగాల కార్మికులకు సామాజిక భద్రత కల్పించే చట్టాలు అమలు చేయాలని కోరారు. విశాఖ స్టీల్‌ప్లాంట్, రైల్వే తదితర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను తక్షణం నిలుపు చేయాలని, ప్రజలపై భారాలు పెంచే 2023 విద్యుత్ చట్టాన్ని రద్దు చేయాలని, అత్యవసర మందులపై జీఎస్టీ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ధరలు తగ్గించేందుకు పెట్రోల్, డీజిల్‌ను జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలని, కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, అప్పటి వరకూ సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని కోరారు. అదానీతో రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలన్నింటినీ రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్ల బిగింపును తక్షణం నిలుపు చేయాలని డిమాండ్ చేశారు. ఏలేరు వరదలకు 122 చోట్ల పడిన గండ్లను తక్షణం పూడ్చాలని, ఆ వరదల్లో దెబ్బ తిన్న పంటలకు తక్షణం బీమా చెల్లించాలని, ఉపాధి పథకాన్ని 200 రోజులకు పెంచి, రోజు వేతనం రూ.600 చెల్లించాలని, కౌలు రైతులకు భూ యజమానితో సంబంధం లేకుండా గుర్తింపు కార్డులు, పంట రుణాలు, నష్టపరిహారాలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు రెగ్యులర్ సేఫ్టీ ఆడిట్లు నిర్వహించాలని, తాండవ, డెక్కన్ చక్కెర పరిశ్రమలను, చిన్నంపేట ఇంటర్ స్నాక్ కాష్యూ పరిశ్రమను తెరిపించి, కార్మికులకు ఉపాధి కల్పించాలని కోరారు. ఎన్నికల హామీ మేరకు వలంటీర్లందరినీ కొనసాగించి, రూ.10 వేల వేతనం చెల్లించాలని, 33 రోజులుగా సమ్మె చేస్తున్న కాకినాడ మున్సిపల్ క్లాప్ డ్రైవర్లకు మూడు నెలల వేతన బకాయిలు, తొమ్మిది నెలల పీఎఫ్ బకాయిలు చెల్లించి, సమ్మెను విరమింపజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేంద్ర కార్మిక సంఘాల నాయకులు పలువురు పాల్గొన్నారు.

శారీరక, మానసిక ఆరోగ్యానికి 'ప్రకృతి పరీక్షణ్'

- యాప్‌ను ప్రారంభించిన ఆర్డీఓ మల్లిబాబు
- వచ్చే నెల 25 వరకు నమోదు చేసుకోవాలని ప్రజలకు పిలుపు



ఆయుష్ శాఖ వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఆర్డీవో మల్లిబాబు తదితరులు

కాకినాడ సిటీ: దేశ్ కా ప్రకృతి పరీక్షణ్ మొబైల్ యాప్ ద్వారా భారతదేశంలోని పౌరులందరూ ఈ నెల 26 నుంచి డిసెంబర్ 25 వరకు 25 రోజుల పాటు తమ వివరాలను నమోదు చేసుకునేందుకు అందుబాటులో ఉంటుందని, ఈ యాప్‌ను ఉపయోగించుకోవాలని ఆర్డీఓ ఎస్.మల్లిబాబు అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో ఆయుష్ శాఖ వైద్యాధికారులతో కలసి ఆయన ఈ యాప్‌ను ప్రారంభించారు. ప్రతి పౌరుని శారీరక, మానసిక ఆరోగ్య సమాచార వివరాలు పొందుపరిచే ఉద్దేశంతో ప్రధాని నరేంద్ర మోడీ అక్టోబర్ 29న ధన్వంతరి జయంతిని పురస్కరించుకుని ఈ యాప్‌ను ప్రారంభించారన్నారు. ప్రకృతిని అనుసరించి ప్రతి రోజు పాటించాల్సిన దినచర్య, ఋతుచర్యను రిజిస్టర్ అయిన ఫోన్ నంబర్‌కు సమాచారం పంపుతారన్నారు. డివిజన్‌లోని పౌరులు సమీపంలో ఉన్న ఆయుష్ విభాగం అధికారులు, అందరి ఆయుర్వేద ప్రభుత్వ, ప్రైవేటు వైద్యుల వద్ద నమోదు చేసుకోవచ్చని ఆర్డీవో తెలిపారు. అనంతరం యాప్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి, అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మొదటిగా ఆర్డీవో తన వివరాలను యాప్‌లో నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో ఆయుష్ వైద్య అధికారులు, వైద్యులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం సీజ్



గోదాంలో బియ్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు, చైర్మన్ సుధీర్

కరప: మండలం నడకుదురులోని రైసుమిల్లు గోదాంలో పీడీఎస్ బియ్యాన్ని మంగళవారం పౌర సరఫరాల శాఖ అధికారులు సీజ్ చేశారు. సాంకేతిక నిపుణులు పరీక్షించిన తరువాతే ఇవి పీడీఎస్ బియ్యమా కాదా అని తెలుస్తుందని సివిల్ సప్లై కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్ తెలిపారు. ముందస్తు సమాచారంతో ఆయన ఆ గోదాములో తనిఖీ చేసి ఈ నిల్వలను గుర్తించి వెంటనే కలెక్టర్ షణ్మోహన్‌కు సమాచారం ఇచ్చారు. కలెక్టర్ ఆదేశాలతో జిల్లా పౌర సరఫరా అధికారులు, తహసీల్దార్ ఎస్.సత్యనారాయణ, ఎస్సై టి.సునీత ఈ తనిఖీలు చేపట్టారు. అనంతరం సుధీర్ విలేకరులతో మాట్లాడుతూ ఈ గోదాంలోని బియ్యాన్ని పరీక్షించే వరకు సరకు అధికారుల స్వాధీనంలో ఉంటుందని తెలిపారు. అలాగే తెలంగాణ నుంచి ఐదు లారీలోల బియ్యం ఇక్కడకు వచ్చినట్టు గుర్తించామని, వాటి వే బిల్లులు, వచ్చిన నిల్వ సరిపోవడంలేదన్నారు.

దేవస్థానం నిధులతో ప్రహరీ నిర్మాణం

- భావనారాయణ స్వామి ఆలయ ఈఓ మాచిరాజు
- పురావస్తు శాఖ అధికారులు అనుమతిచ్చారని వెల్లడి



ఆలయంలో ప్రహరీని పరిశీలిస్తున్న పురావస్తు శాఖ అధికారులు

కాకినాడ రూరల్: సర్పవరం గ్రామంలోని రాజ్యలక్ష్మీ సమేత భావనారాయణ స్వామి ఆలయ అతి పురాతన ప్రహరీ గోడను దేవస్థానం నిధులతో నిర్మించుకునేందుకు పురావస్తు శాఖ అధికారులు అనుమతి ఇచ్చారని ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ తెలిపారు. కొన్నేళ్ల క్రితం ఆలయ ప్రహరీ గోడ కూలిపోవడంతో పురావస్తు శాఖ అధికారులు అంచనాలు రూపొందించి ప్రతిపాదనలు చేశారు. ప్రభుత్వం నుంచి నిధులు రాకపోవడంతో కొత్తగా విధుల్లో చేరిన ఈఓ లక్ష్మీనారాయణ భక్తులు, గ్రామస్తుల అభ్యర్థన మేరకు మరోసారి పురావస్తు శాఖను సంప్రదించారు. ఈ నేపథ్యంలో పురావస్తు శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కె.తిమ్మరాజు, సిబ్బంది మంగళవారం సర్పవరం ఆలయాన్ని సందర్శించారు. సుమారు ఏడేళ్ల క్రితం కూలిపోయిన ప్రహరీ గోడతో పాటు ఆలయంలో నిర్మాణాలను పరిశీలించారు. గానుగ సున్నంతో ప్రహరీ నిర్మాణానికి వారు అనుమతి ఇచ్చారని, అలాగే ఆలయ ప్రాంగణంలో గోశాల, ఆఫీసు రూమ్ నిర్మాణానికి అనుమతి ఇచ్చారని ఈఓ తెలియజేశారు.

ఉన్నతమైనది భారత రాజ్యాంగం

మూడో అదనపు జిల్లా జడ్జి కమలాదేవి



జేఎన్‌టీయూకేలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించిన ఇన్‌చార్జి వీసీ తదితరులు



నన్నయ ఎంఎస్ఎన్ పీజీ సెంటర్‌లో అధ్యాపకులు, విద్యార్థుల నివాళి



కరప మండల పరిషత్ కార్యాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న ఏఓ నరసింహం తదితరులు



మానవహారంగా ఏర్పడి రాజ్యాంగ పీఠిక ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం



రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్సీ నాయకులు



ఏఎస్‌డీ కళాశాలలో నివాళులర్పిస్తున్న విద్యార్థులు, న్యాయ నిపుణులు



ఏపీఎస్పీలో అంబేద్కర్ చిత్రపటానికి అడిషనల్ కమాండెంట్ తదితరులు నివాళులు



రమణయ్యపేటలో ప్రతిజ్ఞ చేయిస్తున్న న్యాయవాది రవిశంకర్ పట్నాయక్



వాకాడ పాఠశాలలో వివిధ పోటీల విజేతలతో ఎంఈఓ, ఉపాధ్యాయులు

కాకినాడ లీగల్: భారత రాజ్యాంగం ప్రపంచ దేశాల్లోనే గొప్పదని, ప్రతి పౌరుడూ స్వేచ్ఛగా జీవించే హక్కును రాజ్యాంగం కల్పించిందని మూడో అదనపు జిల్లా జడ్జి పి.కమలాదేవి అన్నారు. జాతీయ రాజ్యాంగ దినోత్సవాన్ని మంగళవారం కోర్టు హాలులో నిర్వహించారు. కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రజల ప్రయోజనాలను రాజ్యాంగం పరిరక్షించేలా న్యాయవ్యవస్థ పనిచేస్తోందన్నారు. ముందుగా న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు ఉద్యోగులు ప్రతిజ్ఞ చేశారు.

దేశానికి దిక్సూచి రాజ్యాంగం

బాలాజీచెరువు: భారతదేశానికి దిక్సూచిగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం అవతరించిందని జేఎన్‌టీయూకే ఇన్‌చార్జ్ వీసీ డాక్టర్ మురళీకృష్ణ పేర్కొన్నారు. మంగళవారం వర్సిటీ ఆవరణలోని అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించి రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. రాజ్యాంగం వలన నేడు భారత పౌరులు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు అనుభవిస్తున్నార ని, నవంబర్ 26వ తేదీన రాజ్యాంగాన్ని బధిరులకు ఉపయోగపడేలా బ్రెయిలీ లిపిలో అనువదించారన్నారు. కార్యక్రమంలో రెక్టార్ రమణ, రిజిస్ట్రార్ రవీంద్రనాథ్, లా వర్సిటీ ప్రొఫెసర్ సత్యనారాయణ, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

గీతం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో జేఎన్‌టీయూకే ప్రొఫెసర్ ఆలపాటి శ్రీనివాసరావు రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించి విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. రాజ్యాంగ ప్రాముఖ్యత వివరిస్తూ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఎస్ సలహా మండలి సభ్యులు ఎం.సత్యనారాయణ, డైరెక్టర్ సుజ్ఞాన్, ప్రిన్సిపాల్ శారద పాల్గొన్నారు.

హెల్త్ అవేర్‌నెస్ ఆధ్వర్యంలో..

రాజ్యాంగంలో ఉన్న చట్టాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని హెల్త్ అవేర్‌నెస్ సంస్థ అధ్యక్షుడు, అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ డాక్టర్ చప్పిడి వేంకటేశ్వరరావు పేర్కొన్నారు. రాజ్యాంగ ముసాయిదాను నవంబర్ 26వ తేదీన ఆమోదించి చట్టంగా చేశారని, అదే రోజు జాతీయ న్యాయ దినోత్సవంగా నిర్వహిస్తున్నారని తెలిపారు.

ఏపీఎస్పీలో...

కాకినాడ రూరల్: ఏపీఎస్పీ 3వ బెటాలియన్‌తో పాటు కాకినాడ రూరల్‌లో పలు చోట్ల భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా జరిగాయి. ఏపీఎస్పీ క్యాంపు కార్యాలయంలో రాజ్యాంగ నిర్మాత డాక్టరు బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి అడిషనల్ కమాండెంట్ దేవానందరావు, అడిషనల్ ఎస్పీ ఎల్.అర్జున్, అసిస్టెంట్ కమాండెంట్లు మురళీకుమార్, మోహన్‌రావు, చంద్రశేఖర్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసరు మురళీమోహనరావు, ఆర్ఐలు తదితరులు ఘనంగా నివాళులర్పించారు.

నన్నయ పీజీ సెంటరులో..

అచ్చంపేట జంక్షన్ వద్ద నన్నయ ఎంఎస్ఎన్ పీజీ సెంటరులో పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎం.కమలకుమారి ముఖ్య అతిథిగా పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించి అనంతరం రాజ్యాంగ ఫలాలను వివరించారు. జోసెఫ్ స్టీఫెన్, విశాఖపట్నం దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ ప్రొఫెసరు గంట సత్యనారాయణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

బాధ్యతాయుతంగా ఉంటామని ప్రతిజ్ఞ

భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని పురస్కరించుకుని రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో ఆడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బాధ్యతాయుతమైన పౌరులుగా ఉంటామని న్యాయవాది రవిశంకర్ పట్నాయక్ ప్రతిజ్ఞ చేయించారు.

కరపలో..

కరప: స్థానిక పంచాయతీ కార్యాలయంలో మంగళవారం భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని నిర్వహించారు. సర్పంచ్ సాదే ఆశాజ్యోతి ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఏఓ జీఎస్ నరసింహం ఆధ్వర్యంలో అంబేద్కర్‌కు, మండల అంబేద్కర్ యువజన సేవాసంఘం ఆధ్వర్యంలో కరపలో మాలల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించి అంబేద్కర్‌కు నివాళులర్పించారు. మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పండు అశోక్‌కుమార్, దొనం నీలకంఠ, సంఘం ప్రతినిధులతో పాటు కరప, నడకుదురు సర్పంచ్ ఆశాజ్యోతి, దేగల లలితాకుమారి, మాజీ జెడ్పీటీసీ బుంగా సింహాద్రి, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు మాతా సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు. అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు మెండు గోవిందు ఆధ్వర్యంలో డాక్టర్ బొండా వెంకన్నారావు జేఎస్పీ నాయకులు భారతరాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించి, కరప పీహెచ్‌సీ ఎదురుగా అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. అలాగే వాకాడ మండల ప్రాథమిక పాఠశాలలో ఎంఈఓ పి.సత్యనారాయణ, హెచ్ఎం వి.శ్రీరామారావు, కార్యదర్శి పి.సునీల్ అంబేడ్కర్ చిత్రపటంవద్ద నివాళులర్పించారు.

ఇంద్రపాలెంలో..

కాకినాడ రూరల్: మండలంలోని ఇంద్రపాలెంలో అంబేద్కర్ కాంస్య విగ్రహం వద్ద సామాజిక న్యాయ సాధన సమితి, యునైటెడ్ ఎస్సీ, ఎస్టీ ఫోరం ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ మాజీ వీసీ డాక్టర్ కె.బాబ్జీ, సామాజిక న్యాయ సాధన సమితి అధ్యక్షురాలు డాక్టరు భానుమతి ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రతి ఒక్కరూ రాజ్యాంగ పరిరక్షణకు కృషి చేయాలన్నారు.

నగరపాలక సంస్థ కార్యాలయంలో..

కాకినాడ సిటీ: స్థానిక కొండయ్యపాలెంలోని నగరపాలక సంస్థ కార్యాలయం ఆవరణలో రాజ్యాంగ దినోత్సవాన్ని అధికారులు మంగళవారం నిర్వహించారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్, గాంధీజీ చిత్రపటాలకి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజ్యాంగ విలువలు పాటిస్తామంటూ నగరపాలక అధికారులు, ఉద్యోగులు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ శిరీష, అకౌంటెంట్ సత్యనారాయణ, వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

అలాగే కలెక్టరేట్ సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్సీ అభ్యర్థి హాసన్ షరీఫ్, అయితాబత్తుల రామేశ్వరరావు తదితరులు ప్రతిజ్ఞ చేశారు. రాష్ట్రంలో రాజ్యాంగం ప్రకారం కాకుండా రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని షరీఫ్ విమర్శించారు.

డీఎంహెచ్‌వో కార్యాలయంలో...

కాకినాడ క్రైం: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహనాయక్ కార్యాలయం ఆవరణలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో డీఎల్ఏటీవో డాక్టర్ రోణంకి రమేష్, డీఐవో డాక్టర్ కేవీ సుబ్బరాజు, ఆర్‌బీఎస్‌కే పీవో డాక్టర్ ప్రభాకర్, డెమో ప్రసాద్ రాజు తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో..

జీజీహెచ్‌లో సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి పోర్టికోలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ఎంపీఆర్ విఠల్, డిప్యూటీ కలెక్టర్, అడ్మినిస్ట్రేటర్ శ్రీధర్, డీసీఎస్ ఆర్ఎంవో డాక్టర్ అనిత తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఏఎస్‌డీలో..

కాకినాడ సిటీ: అన్నవరం సత్యవతీదేవి ప్రభుత్వ మహిళా కళాశాలలో చరిత్ర, రాజనీతి శాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో మంగళవారం చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. భారత రాజ్యాంగం ప్రాముఖ్యతను న్యాయశాస్త్ర నిపుణులు జి.సునీల్‌కాంత్, పి.ఏసుబాబు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ అనంతలక్ష్మి, అధ్యాపకులు వై.సీతామహాలక్ష్మి, బి.సూర్యదేవర, పీవీ భువనేశ్వరిదేవి, భానుతేజ పాల్గొన్నారు.